రైతు సంఘం నాయకుల అరెస్టు


పోలీసు స్టేషన్‌లో రైతు సంఘం నాయకులు

మడకశిరటౌన్, మార్చి 10: జాతీయ స్థాయిలో రైతు ఉద్యమంలో భాగంగా ఆదివారం రైల్ రోకోకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మడకశిర రైతు సంఘం నాయకులను ఇంటెలిజెన్స్ విభాగాధికారులు అరెస్టు చేసి, మడకశిర పోలీసు స్టేషన్‌లో ఉంచారు. రైతు సంఘం నాయకులు ఆనందరంగారెడ్డి, సోమకుమార్, వేమారెడ్డి, రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులను ముందస్తుగా ఆదివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సాయంత్రం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరన్నారు. ముందస్తు అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర ఇచ్చేవరకు పోరాటం ఆపమన్నారు.

రేపు బుక్కపట్నంలో జాబ్‌మేళా

పుట్టపర్తి, మార్చి 10 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంగళవారం బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఒకేషనల్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివినవారికి ఎన్‌ఎంటీ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపడతారన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీయాగం


అలంకరణలో వీరభద్రస్వామి

చండీయాగంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితులు →



లేపాక్షి, మార్చి 10: ప్రసిద్ధిగాంచిన స్థానిక దుర్గావీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం వేద పండితులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీయాగం, సింహవాహనోత్సవం, అభిషేకార్చనలు, మహాపూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. రాత్రికి ముత్యాలపల్లకి, కీలుగుర్రాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం, ధ్వజావరోహణం, శయనోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

5 ఏళ్లలో అన్ని చార్జీల పెంపు


ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న బస్సులు

- ట్రూఅప్ మాటున కరెంటు షాక్
- బస్సెక్కితే టిక్కెట్ ధరల మోత
- స్థలం రిజిస్ట్రేషన్ చార్జీలు డబుల్
- పెరిగిన నెలవారీ బడ్జెట్
- అటకెక్కిన పేదోడి పొదుపు

బాదుడు ప్రభుత్వం.. బతుకులు భారం..!

ఇంట్లో ఉంటే కరెంటు బిల్లులు, బస్సెక్కితే చార్జీలు, కాసింత స్థలం కొనుక్కుందామంటే రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచేశారు పాలకులు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చార్జీల పెంపు మాటున జనంపై భారీగా భారాలు మోపుతున్నారు. పదేపదే పెంచుతూ పేద, మధ్యతరగతి వర్గాల బతుకులను భారంగా మారుస్తున్నారు. ఈ ఐదేళ్లలో విపరీతంగా పెరిగిన ధరలతో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా బతుకు బండి సాఫీగా సాగడంలేదు. రోడ్ల మాదిరిగానే జీవనం కూడా ఆర్థికంగా గుంతలమయంగా మారింది. అన్నివర్గాల ప్రజలూ అప్పుల్లో కూరుకు పోతున్నారు. - ధర్మవరం


స్థలం కొంటే రిజిస్ట్రేషన్ మోత

విద్యుత్ బిల్లులు చూస్తుంటే గుండె గుబేల్‌మంటోంది. పేదలైతే స్విచ్‌పై చేయి వేయాలంటేనే వణికిపోతున్నారు. సామాన్యుడికి ఫ్యాన్ వేయాలంటే దడే. విద్యుత్ బిల్లులు ఎన్నడూ లేనివిధంగా షాక్ కొట్టేస్తున్నాయి. గతంలో రూ.200 వచ్చే బిల్లు ఇప్పుడు రూ.1000 వస్తోంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సాధారణంగా కరెంటు వినియోగం ఎక్కువ. అప్పుడు ప్రభుత్వం ఎక్కువ మొత్తానికి విద్యుత్ కొనుగోలు చేసి, సరఫరా చేస్తుంది. ఆ డబ్బును తర్వాత బిల్లులో లాగేస్తుండడమే బిల్లుల మోతకు కారణం. ఎఫ్‌పీపీసీఏ-1 పేరుతో 2021 ఏప్రిల్ నుంచీ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. 2022 మార్చి వరకూ మూడు నెలల చొప్పున నాలుగు విభాగాలు చేశారు. చివరి విభాగానికి వచ్చే సరికి యూనిట్‌కి 0.6455 పైసలు వసూలు చేశారు. తరువాత ఎఫ్‌పీపీసీఏ-2 అంటూ 2022 ఏప్రిల్ నుంచి మొదలు పెట్టారు. యూనిట్‌కి ఏకంగా 40 పైసలు చొప్పున తరువాత నెలకు జోడిస్తారు. అంటే ఏప్రిల్, మే నెలల్లో వాడిన యూనిట్లకు 40 పైసల చొప్పున జూన్ నెల బిల్లుకు జత చేస్తారు. ఈ తతంగం ప్రస్తుతం కొనసాగుతోంది. మరీ దారుణమైన విషయం ఏమిటంటే.. స్లాబులను పెంచేయడం. గత ప్రభుత్వంలో గృహ వినియోగానికి 0-50 వరకూ యూనిట్‌కి రూ.1.45, 51-100 రూ.2.60, 101-200 రూ.3.60 ఉండేది. 2022 ఏప్రిల్ నుంచి స్లాబులను సవరించడం ద్వారా జేబులకు చిల్లులు పెట్టడం మొదలెట్టారు. కనిష్ఠంగా ఉన్న పరిమితి 50 యూనిట్ల నుంచి 30కి తగ్గించారు. 0-30 వరకూ యూనిట్‌కి రూ.1.90, 31-75 రూ.3, 76-125 రూ.4.50 ఇలా బాదేశారు. టీడీపీ హయాంలో 500 యూనిట్లు దాటితే యూనిట్‌కి రూ.9.06 చొప్పున బిల్లు పడేది. దానిని 400కి తగ్గించి యూనిట్ ధరను ఏకంగా రూ.9.75 చేసేశారు.

విద్యుత్ బిల్లుతో జేబుకు చిల్లు





స్థలం కొని, ఇల్లు కట్టుకోవాలనేది ప్రతి సామాన్యుడి కల. పైసాపైసా పొదుపు చేసి, స్థలం కొని, రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వెళ్తే ఆ చార్జీలు చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం ఏడాపెడా పెంచేయడంతో రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరిగిపోయాయి. పైగా అభివృద్ధి చెందిన చోట అధిక ఆదాయాన్ని రాబట్టుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. 2023 జూన్ 1 నుంచి మార్కెట్ విలువను 10-30 శాతం, ప్రధాన ప్రాంతాల్లో 50శాతం వరకూ పెంచారు. ఎస్ఈజడ్ దగ్గరలో అయితే 75 శాతం మార్కెట్ విలువ పెరిగిపోయింది. దీని కోసం భూమి ధర సవరణలో డైనమిక్ మోడ్‌ని అవలంబించింది. ప్రతి మండలంలో 20శాతం గ్రామాలను, పట్టణాల్లో కొన్ని వార్డులను తీసుకొని అంతకు ముందు ఏడాదిలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రాంతాలను అంచనా వేసి పెంపును అమలు చేసింది. అంతకు ముందు కూడా భూముల మార్కెట్ విలువను పెంచారు. దీంతో రిజిస్ట్రేషన్‌కు తడిసి మోపెడవుతోంది.





బస్సెక్కితే బాదుడే..

ప్రగతి రథ చక్రం ఆవేదనగా అడుగులు వేస్తోంది. ఒకవైపు గతుకుల రోడ్లు... మరోవైపు నిర్వహణకు డబ్బులు లేకపోవడంతో అలాగే నెట్టుకొస్తోంది. ప్రయాణంలో బస్సు చక్రాలు ఊడిపోయే దుస్థితికి పాలకులు ఆర్టీసీని తీసుకొచ్చారు. చార్జీల వాతలు పెడుతూ సామాన్యుడిపై మోయలేని భారం వేస్తున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక ఐదేళ్లలో టిక్కెట్ చార్జీలను మూడుసార్లు బాదేశారు. 2019 డిసెంబరు, 2022 ఏప్రిల్, 2022 జూన్ నెలల్లో బస్సు చార్జీలను పెంచేశారు. దీంతో ఒక కుటుంబం ఎక్కడికైనా వెళ్లాలంటే రూ.500 అయ్యే టిక్కెట్ ప్రస్తుతం రూ.1000కి చేరుకుంది. పైగా తిరుగుతున్న వాటిలో పల్లెవెలుగు బస్సులే ఎక్కువగా ఉంటున్నాయి. కండీషన్ మాటను పక్కనబెట్టి రంగులు పూసి తిప్పేస్తున్నారు. ప్రైవేటు బస్సుల మాట ఎలా ఉన్నా.. ఆర్టీసీ బస్సు ఎక్కి, దిగేసరికి జేబులకు చిల్లులు తప్పవు. వైసీపీ సమావేశాలకు ఆర్టీసీ బస్సులను ఇష్టానుసారం పంపేస్తున్నారు. దీంతో ఆర్టీసీపై మరింత భారం పడుతోంది.



బతుకులు విలవిల..

పేద, మధ్యతరగతి ప్రజలు వచ్చిన ఆదాయాన్ని పొదుపుగా వాడుకుంటూ.. పైసాపైసా పొదుపు చేసుకుంటారు. అలా భవిష్యత్తు అవసరాల కోసం ఎత్తి పెట్టుకుంటారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన చార్జీలతో వారి పొదుపు అటకెక్కింది. పైసా కూడా మిగలని పరిస్థితి దాపురించింది. ఇంకా దారుణం ఏమిటంటే పెరిగిన చార్జీలతో.. వారికొచ్చే ఆదాయం చాలక అప్పులు చేయాల్సి వస్తోంది. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని ఆ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. ఎన్నాళ్లీ ధరల బాదుడు అంటూ వాపోతున్నాయి.




అగ్నిగుండంలో ధూపం వేస్తున్న భక్తులు

వైభవం.. అగ్నిగుండ మహోత్సవం


అలంకరణలో హెంజేరు సిద్దేశ్వరస్వామి


మడకశిరటౌన్, మార్చి 10: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల మూడో రోజు ఆదివారం స్వామి వారి అగ్నిగుండ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. జిల్లా వాసులతోపాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. భక్తులు ధూపం, వేరుశనగ, చెరుకు, చింతకాయలు, చింతకొమ్మలు, వరి, రాగి వంటి వాటిని స్వామివారి అగ్నిగుండంలో వేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. స్వామివారికి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, పరిపూర్ణానందస్వామి పూజలు చేశారు.

సిద్దేశ్వరస్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు



భానుడి భగభగ

10 గంటలకే మండుతున్న ఎండలు



45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

బయటకు రావాలంటే జంకుతున్న జనం

ధర్మవరంరూరల్, మార్చి10: ఎండలు మండిపోతున్నాయి. భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 9 గంటలకే ఎండలు మండుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇవేమి ఎండలు బాబోయ్ అంటూ హడలెత్తిపోతున్నారు. భానుడి ప్రతానికి ధర్మవరంలో ఉదయం 10 గంటలకే రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వారం రోజుల నుంచి ఎండలు మండిపోతుండటంతో పట్టణ ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఉంది. సుమారు 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. ప్రజలు బయట తిరగకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని తెలుపుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఈ ఎండలకు బయట తిరిగితే వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కావున ఆ వయసు వారు బయటకు రాకూడదని సూచిస్తున్నారు.


నిర్మానుష్యంగా మారిన ధర్మవరం కళాజ్యోతి సర్కిల్‌లోని రహదారి


వాహనాల రాకపోకలు లేక ఖాళీగా ఉన్న పోతుకుంట రైల్వేబ్రిడ్జి

పండని ఫలరాజం..!


దిగుబడిలేని మామిడి తోట

మామిడికి అనుకూలించని వాతావరణం



- ఆలస్యంగా పూత
- మంచుతో రాలిపోయిన పైనం
- దారుణంగా పడిపోయిన దిగుబడి
- నష్టాలు మూటగట్టుకుంటున్న రైతులు

గాండ్లపెంట, మార్చి 10: వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి దిగుబడి దారుణంగా పడిపోయింది. పెట్టుబడులు కూడా దక్కేలా లేవని అన్నదాతలు వాపోతున్నారు. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత పూస్తుంది. ఈసారి మార్చి వచ్చినా.. పూత పూస్తూనే ఉంది. మామిడికి వాతావరణం అనుకూలిస్తేనే సరైన సమయంలో పూత వస్తుంది. ఈ ఏడాది మంచు అధికంగా కురవడం కారణంగా భూమిలో ఉష్ణోగ్రతలు తగ్గి మార్చిలో కూడా పూత వస్తూనే ఉంది. ఎండలు అధికం కావడంతో పూత, పిందెలు రాలిపోయే అవకాశాలు ఎక్కువ. పూత సరిగా రాకపోవడంతో రైతులు పలుమార్లు వివిధ రకాల మందులు పిచికారీ చేశారు. అయినా.. అధికంగా రాలిపోయింది. పూతను నిలిపేందుకు మళ్లీ మందులు పిచికారీ చేశారు. పూత దశలో తెనె మంచు పురుగుఆశించడంతో దానిని నియంత్రించేందుకు మళ్లీ మందులు కొట్టాల్సి వచ్చింది. ఇలా.. పదే పదే మందుల పిచికారీకి రైతులు భారీగా వెచ్చించాల్సి వచ్చింది. కొన్నిచోట్ల మామిడి తోటల్లో పూత రాలిపోవడంతో కొత్త ఆకులు చిగురించాయి. రెండేళ్లుగా రైతులు, మామిడి వ్యాపారులకు మంచి దిగుబడివచ్చి లాభాలు పొందారు. ఈయేడాది కూడా ఆశించిన మేర దిగుబడులు వస్తాయని రైతుల వద్ద నుంచి మామిడి వ్యాపారులు రూ.లక్షలు పెట్టి తోటలు కొనుగోలు చేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రూ.వేలు ఖర్చుపెట్టి పురుగు మందులు పిచికారీ చేశారు. కనీసం కొన్ని తోటల్లో ఆ ఖర్చులు కూడా దక్కే అవకాశం కనిపించట్లేదు. వ్యాపారులు నష్టాలను చవిచూసే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

నష్టం వాటిల్లే అవకాశం ఉంది

మూడెకరాల మామిడి తోట ఉంది. రెండేళ్లుగా కొంతమేర లాభాలు స్వీకరించా. ఈసారి పూత అంతంతమాత్రమే వచ్చింది. ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నాం. ఆశించిన స్థాయిలో కాపు రాలేదు. నష్టం వాటిల్లే అవకాశముంది.

- గంగిశెట్టి, రైతు, వేపరాల, గాండ్లపెంట మండలం




తేనె మంచు పురుగు ఆశించిన చెట్టు

పెట్టుబడులు కూడా దక్కవు

కొన్నేళ్లుగా మామిడి తోటలు కొనుగోలు చేసి, వ్యాపారం చేస్తున్నా. ఈసారి కూడా రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి, తోటలు కొనుగోలు చేశా. వాతావరణం అనుకూలించక పూత ఆలస్యమైంది. ఇప్పటికే మామిడి తోటలకు పలుమార్లు రూ.వేలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేశా. ఆశించినమేర దిగుబడి రాలేదు. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే అవకాశం కనిపించట్లేదు.

- అల్లాబక్షు, వ్యాపారి, గాండ్లపెంట



మంత్రి ఉషశ్రీ కారును ఢీకొన్న ఆటో

పెనుకొండ రూరల్, మార్చి 10: పెనుకొండ నగర పంచాయతీ పరిధి వెంకటరెడ్డిపల్లి గ్రామంలో మంత్రి ఉషశ్రీ కారును ఆదివారం ఆటో ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంత్రి ఉషశ్రీ ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా వెంకటరెడ్డిపల్లికి ఉదయం వెళ్లారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చడంతో పొగ చుట్టుకుంది. ఈ క్రమంలోనే మంత్రి కారు దిగుతుండగా పెనుకొండ వైపు నుంచి కొత్తచెరువు వైపు వెళ్లే ఆటో కారును ఢీకొంది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మంత్రి కారు పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి, మార్చి 10: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్, మండల, గ్రామస్థాయిలో కూడా స్పందన కార్యక్రమాలు ఉంటాయనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శంఖారావం... సూపర్‌హిట్‌



ఉరవకొండలో నిర్వహించిన శంఖారావం సభలో ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలదండ వేస్తున్న నారా లోకేశ్‌, పయ్యావుల కేశవ్‌

తండ్రీకొడుకులది దోపిడీ

ఐదేళ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదు

మాజీ ఎమ్మెల్యే ‘విశ్వ’పై నారా లోకేశ్‌ విమర్శలు

గుంతకల్లు/ఉరవకొండ, మార్చి10: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నియోజక వర్గానికి ఐదేళ్లలో చేసిందేమీ లేదని, విశ్వ, ఆయన కొడుకు కలిసి దోచుకున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ విమర్శించారు. ఆదివారం ఉదయం ఉరవకొండలో నిర్వహించిన శంఖారావ బహిరంగ సభలో లోకేశ్‌ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఆయన కుమారుడు దొంగ ఆధార్‌ కార్డులు, పత్రాలు సృష్టించి ప్రైవేటు భూములు కొట్టేశారన్నారు. పొరపాటున కూడా మీ ఇల్లు వారికి చూపించరాదని, అది వారికి నచ్చితే దాన్ని కూడా దొంగ రికార్డులతో స్వాహా చేస్తారని విమర్శించారు. ‘విశ్వేశ్వర రెడ్డీ! ఎమ్మెల్యేగా ఉన్నపుడు నియోజకవర్గానికి ఇది కావాలి అని అడిగావా?, కనీసం ఇప్పుడైనా నీ నాయకుడిని అడిగావా?’ అని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌ ఇచ్చిన హామీలు కూడా ఈ ఐదేళ్లలో అడగలేదన్నారు. హంద్రీనీవా పనులు కూడా పూర్తి చేస్తామని చెప్పిన జగన్‌ మాట తప్పారన్నారు. 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

టీడీపీ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

టీడీపీ హయాంలోనే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కేశవ్‌కు మైక్‌ ఇవ్వడం లేదంటే వైసీపీ పాలకులు ఎంత భయపడుతున్నారో అర్థమవుతోందన్నారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా కేశవ్‌ గెలవకపోయినా పనులు చేశారన్నారు. రూ.890 కోట్లతో మెగా డ్రిప్‌ ప్రాజెక్టు, మూడు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించారన్నారు. ఎన్టీఆర్‌ గృహపథకం కింద నియోజక వర్గానికి 18వేల ఇళ్లు తీసుకువచ్చిన ఘనత కేశవ్‌దే అని ప్రశంసించారు. రెండు నెలలు ఓపిక పడితే పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

జగన్‌ ప్రభుత్వాన్ని దించడానికి జనం సిద్ధం

టీడీపీ ప్రభంజనం ఢిల్లీదాకా వినిపిస్తోంది

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌



విక్టరీ గుర్తు చూపుతున్న కార్యకర్తలు

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలే కాదు జగన్‌ తల్లి, చెల్లి కూడా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ పేర్కొన్నారు. ఉరవకొండ శివారులోని అనంతపురం- బళ్లారి రహదారిలోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలో ఆదివారం ఉదయం టీడీపీ శంఖారావం సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే కేశవ్‌ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కీలక పరిణామం అన్నారు. ఈ కూటమి ప్రభంజనంతో అరాచక ప్రభుత్వం అడ్రస్‌ లేకుండా పోతుందన్నారు. టీడీపీని బీజేపీ కలుపుకుందంటే ఏపీ ఎన్నికల నాడి ఢిల్లీదాకా తెలిసిపోయిందన్నారు. ఈ చారిత్రక కలయిక ద్వారా రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అభివృద్ధితో ఆదాయాన్ని సృష్టించి పేదలకు ఇవ్వడం చంద్రబాబు సిద్ధాంతమైతే, చేతకాక అప్పులు తెచ్చి పంచడం జగన్‌ నైజమన్నారు. దీంతో రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తరిమికొట్టాలని పిలుపినిచ్చారు. ఉరవకొండలో జల దీక్ష సమయంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలలోపు 80 వేల ఎకరాలకు హంద్రీనీవాకు నీరు ఇస్తామని చెప్పిన జగన్‌, అధికారంలోకి వచ్చి ఐదేళ్లైనా మూడు ఎకరాలకు నీరు ఇవ్వలేదన్నారు. జీబీసీ ఆధునికీకరణ, హంద్రీనీవా నుంచి జీబీసీకి నీరివ్వడం, డ్రిప్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టును మంజూరు చేయించానన్నారు. విశ్వ మూడు తట్టల మట్టి తీయలేదని విమర్శించారు. జలదీక్ష మాని.. ధనదీక్షలో పడిపోయి, దోచుకోవడమే పనిగా పెట్టుకున్నా డని ఆరోపించారు. 28 ఏళ్ల వయస్సులో రాజకీయాల్లోకి వచ్చిన తనను నియోజకవర్గ ప్రజలు ఆదరించారని, 1994 ఫలితాలు పునరావృతమయ్యే లా ఓటువేయాలని, చరిత్రను తిరగరాయాలని పిలుపునిచ్చారు.



రాయదుర్గం శంఖారావం సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న నారా లోకేశ్‌

సభలకు పోటెత్తిన జనాలు... లోకేశ్‌ ప్రసంగాలకు అద్భుత స్పందన

నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం

‘జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ పాల్గొన్న శంఖారావం సభలకు జనం పోటెత్తారు. ఆదివారం ఆయన ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో నిర్వహించిన శంఖారావం సభల్లో పాల్గొన్నారు. ఆయా సభల్లో అధికార పార్టీ తీరును ఎండగడుతూ లోకేశ్‌ చేసిన ప్రసంగాలకు అద్భుత స్పందన లభించింది. సీఎం జగన్‌ మొదలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికార పార్టీ నాయకులపై లోకేశ్‌ చెణుకులు విసురుతూ కార్యకర్తలను ఉర్రూతలూగించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను ఎత్తి చూపుతూ, తాము అధికారంలోకి వస్తే వాటిని ఎలా పరిష్కరిస్తామో వివరించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైసీపీ పాలనకు ఉన్న తేడాను ఎత్తి చూపుతూ లోకేశ్‌ ప్రసంగించిన తీరు సభికులను ఆకట్టుకుంది. మొత్తంగా మూడు నియోజకవర్గాల్లో నిర్వహించిన శంఖారావం సభలు ఒకదానికి మించి మరొకటి విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.’

దుర్గం పసుపుమయం

రాయదుర్గం, మార్చి 10: తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ రాకతో రాయదుర్గం పసుపుమయం అయ్యింది. శంఖారావం సభకు జనం పోటెత్తారు. లోకేశ్‌ను చూసిన ఆనందంలో టీడీపీ శ్రేణులు ఈలలు, కేకలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించాయి. ఆయనతో కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. అందుకుతగ్గట్టుగానే లోకేశ్‌ ప్రసంగం సాగడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కణేకల్లు రోడ్డులోని రాయల్‌ ఎంసీఏ కళాశాల వద్ద ఆదివారం శంఖారావం సభను నారా లోకేశ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యంగా లోకేశ్‌ వేదిక మీదకు రాగానే ఈలలు, చప్పట్లతో కేరింతలు కొడుతూ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతించారు. ఉత్సాహంతో కొంతమంది యువకులు లోకేశ్‌ను కలిసేందుకు ప్రయత్నించగా ఆయనే వారిని ఆహ్వానించి ఫొటోలు దిగారు. సీఎం జగన్‌ను ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌తో పోల్చుతూ చెణుకులు విసరడంతో కార్యకర్తల్లో జోష్‌ పెరిగింది. బీజేపీతో కలిసి జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు ను అధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మీదేనని వెల్లడించారు. అనంతరం కాలవ శ్రీనివాసులు నెత్తిపై పార్టీ టోపీ పెట్టి, జేబుకు సైకిల్‌ గుర్తు అతికించారు. తన తాత ఎన్టీఆర్‌ను సీఎంను చేసి, మామ హరికృష్ణను శాసనసభకు పంపించి, ముద్దుల బాలయ్యను రెండుసార్లు శాసనసభ్యునిగా ఆదరించిన ఈ ఉమ్మడి అనంత జిల్లాపై ప్రత్యేక ప్రేమ ఉందని పేర్కొన్నారు.

అవినీతిపరుడిని సాగనంపి.. అసమర్థుడిని తెచ్చుకున్నారు..

తమ కంటే ఎక్కువ అవినీతి సొమ్ము పోగేస్తున్నాడనే ఈర్ష్యతో ఇక్కడి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని బయటికి పంపి ఓ అసమర్థుడిని తెచ్చిపెట్టాడని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించారు. ఈ అసమర్థుడు ఒక్కసారైనా సీఎం జగన్‌ దగ్గరకు వెళ్లి మా నియోజకవర్గానికి ఇన్ని సమస్యలున్నాయి, నిధులు కేటాయించాలని అడిగిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. సమర్థుడైన కాలవ శ్రీనివాసులును అఖండ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీదేనని తెలిపారు. అనంతరం కాలవ శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీటీపీ, ఉంతకల్లు రిజర్వాయర్లకు నీరిస్తాం

తాము అధికారంలోకి రాగానే భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు నీరందించడమే కాకుండా ఉంతకల్లు రిజర్వాయర్‌ను నిర్మిస్తామ ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ హామీ ఇచ్చారు. ఆదివారం జరిగిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న కాలవ శ్రీనివాసులు కుప్పం నియోజకవర్గం కంటే అధికంగా ఇక్కడకు నిధులు తెచ్చి అభివృద్ధి చేశారన్నారు. అంతే కాకుండా తాను మంత్రిగా ఉన్న శాఖ నుంచి అత్యధికంగా నిధులు తెచ్చుకున్నారన్నారు. సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలులాంటి అనేక కార్యక్రమాలు చేశారన్నారు. కేవలం రాయదుర్గం పట్టణానికి ఇండోర్‌ స్టేడియం నిర్మాణంతో పాటు రూ.85 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ. 44 కోట్ల డ్రిప్‌ ఇరిగేషన్‌ కోసం ఖర్చు చేసి రైతులకు లబ్ధి చేకూర్చారన్నారు. హాస్టల్‌, స్కూల్‌ భవనాలు, సబ్‌సర్ఫేస్‌ డ్యాంలతో పాటు రూ.120 కోట్లు ఖర్చు పెట్టి ఎన్టీఆర్‌ టిడ్కో భవనాల నిర్మాణాలను శ్రీకారం చుట్టామన్నారు. ఐదేళ్ల జగన్‌ పాలనలో అభివృద్ధిపై చర్చించేందుకు కాలవ శ్రీనివాసులు సిద్ధంగా ఉన్నారని, మీరు సిద్ధమా అని వైసీపీ నాయకులకు సవాల్‌ విసిరారు.



సూపర్‌ సిక్స్‌ పథకాలకు సంబంధించిన బ్యాగును కాలవ శ్రీనివాసులుకు అందజేస్తున్న నారా లోకేశ్‌

లోకేశ్‌ నాయకత్వాన్ని బలపరచాలి: కాలవ

ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న నారా లోకేశ్‌ నాయకత్వాన్ని బలపరచాలని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభలో ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో అఖండమైన మెజార్టీతో తెలుగుదేశం జెండా ఎగురవేయాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా లోకేశ్‌ ఉన్నప్పుడు రాయదుర్గం అభివృద్ధి కోసం చాలా నిధులు మంజూరు చేశారని కొనియాడారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు రూ. 945 కోట్లు మంజూరు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకొని ఆ పనులు పూర్తి చేసుకుందామన్నారు. ఆదిశనగా కార్యకర్తలు పని చేయాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ మంజునాథ్‌ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పీడిస్తున్న జగన్‌ను ఓడించడానికి పొత్తులు పెట్టుకోవడం తప్పు కాదన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడండి : నారా లోకేశ్‌

కణేకల్లు: వైసీపీ పాలనకు చరమగీతం పాడి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండ పర్యటన ముగించుకుని కణేకల్లు మీదుగా వెళుతున్న సమయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆపి పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంతమంది కార్యకర్తలు ఈ సారి టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలపగా.. దీనికి నారా లోకేశ్‌ వైసీపీని పూర్తిగా తుడిచిపెట్టేయాలంటూ చేతి సంజ్ఞలతో వారికి సమాధానమిచ్చారు. అంతకు ముందు మాల్యం వేదవతి హగరిలో ఆయన సెల్ఫీ దిగి అక్కడ ఉన్న కొంతమందితో వేదావతి హగరి గురించి ఆరా తీశారు. కణేకల్లులో టీడీపీ కన్వీనర్‌ లాలెప్ప, ఆనంద్‌రాజ్‌, వేలూరు మరియప్ప, బీటీ రమేష్‌, షేక్‌ముజ్జు, అనిల్‌, చంద్రశేఖర్‌గుప్తా, హనుమాపురంలో ఎంపీటీసీ నరేంద్ర, సర్పంచ్‌ జయరాంచౌదరి, కణేకల్లు క్రాసింగ్‌లో ఆది, బాయినేని నవీన్‌, బసవరాజు, కిష్ట, కోళకుర్తి సుదర్శన్‌ నారా లోకేశ్‌కు స్వాగతం పలికారు.



నారా లోకేశ్‌కు నాగలి అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు

బదిలీతో నీతిమంతురాలు అవుతుందా ?

శంఖారావం సభలో మంత్రి ఉష శ్రీ చరణ్‌పై నిప్పులు చెరిగిన లోకేశ్‌

ఎంపీ రంగయ్యకు ఓటు అడిగే అర్హత లేదని ఉద్ఘాటన

కళ్యాణదుర్గం, మార్చి 10: అవినీతి మంత్రిగా పేరు సంపాదించిన ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు ట్రాన్స్‌ఫర్‌ చేసినంత మాత్రాన ఆమె నీతిమంతురాలు అవుతుందా అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ ప్రశ్నించారు. ఆదివారం కళ్యాణదుర్గం సమీపంలోని గరుడాపురం రోడ్డు సమీపాన ఏర్పాటు చేసిన శంఖారావం సభలో నారా లోకేశ్‌ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి ఉష శ్రీ చరణ్‌, ఎంపీ రంగయ్యపై ఘాటు విమర్శలు చేశారు. గత ఐదేళ్ల పాలనలో అవినీతిలో అగ్రస్థానం ఆమెకు దక్కిందన్నారు. చెరువులు కబ్జా చేసి, అక్రమంగా సంపాదించిన డబ్బుతో 250 ఎకరాలలో రిసార్ట్స్‌ కడుతున్నారని విమర్శించారు. ప్రజల సొమ్ముతో అత్యంత ఖరీదైన బంగ్లాను నిర్మించుకున్న మంత్రి ఉష శ్రీ చరణ్‌ అవినీతిలో రికార్డు స్థాయికి ఎక్కిందన్నారు. ఎంపీగా ఉన్న రంగయ్య పార్లమెంటులో రాష్ట్ర అభివృద్ధిపై ఏ మాత్రం చర్చించలేదని, ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేదన్నారు. ఎంపీగా పనికిరాని రంగయ్య ఎమ్మెల్యేగా పోటీచేసేందుకు కూడా అనర్హుడంటూ మండిపడ్డారు. ఆయనకు ఓటు అడిగే అర్హత కూడా లేదని పేర్కొన్నారు. మంత్రి ఉష శ్రీచరణ్‌ అవినీతిపైన ఎంపీ తలారి రంగయ్య పనితీరుపై నారా లోకేశ్‌ విమర్శలు గుప్పించడంతో శంఖారావం సభ ఈలలు, చప్పట్లతో మార్మోగింది.

బీటీపీ కాలువ పనులు పూర్తి చేస్తాం

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

టీడీపీ అధికారంలోకి రాగానే భైరవాన్‌ తిప్ప ప్రాజెక్టు కాలువ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని విధాలా వెనుకబడి ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. దాదాపు 25 వేల మందికిపైగా శంఖారావం సభకు హాజరవడంతో కళ్యాణదుర్గం పసుపుమయంగా మారింది. సురేంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు, అభిమానుల ఈలలు, చప్పట్లతో శంఖారావం సభ మార్మోగిపోయింది. కళ్యాణదుర్గం కంచుకోటలో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించి చంద్రబాబు, లోకేశ్‌కు కానుకగా ఇస్తామని అమిలినేని సురేంద్రబాబు ప్రకటించారు. జనసేన సమన్వయకర్త బాల్యం రాజేష్‌ మాట్లాడుతూ.. మంత్రి ఉషశ్రీచరణ్‌ సహజవనరులను కొల్లగొట్టి బెంగళూరులో దాచుకున్నారన్నారు. లోకేశ్‌ రెడ్‌ బుక్‌లో ఈ విషయాన్ని రాసుకుని తిన్నదంతా కక్కించాలని కోరారు.

పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు




కార్యకర్తల ఉత్సాహం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ ఆదివారం కళ్యాణదుర్గంలో నిర్వహించిన సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, గరుడాపురం రోడ్డు, ప్రజావేదిక వద్ద తెలుగు తమ్ముళ్లు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలతో కిక్కిరిసి పోయాయి. ఎక్కడ చూసినా పసుపు జెండాలే కనిపించాయి. చిన్నారులు సైతం టీడీపీ జెండాను చేతపట్టి జై చంద్రబాబు.. జై నారా లోకేశ్‌ అంటూ నినాదాలు చేశారు. బ్రహ్మసముద్రం మండలం మాముడూరు గ్రామానికి చెందిన అంధుడు వన్నూరుస్వామి జెండా చేతపట్టి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

పెరుగుతున్న డెంగీ బాధితులు

నిర్లక్ష్యం వీడని ఉన్నతాధికారులు



అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోక్షిత, జాహ్నవి

శింగనమల, మార్చి 10: మండలంలో డెంగీ, వైరల్‌ జ్వరాల బారిన పడుతున్న చిన్నారులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఆదివారం పోతురాజు కాలువ గ్రామానికి చెందిన మోక్షిత, సోదనపల్లికి చెందిన జహ్నవి జ్వరాలతో అనంతపురం పెద్దాసుపత్రిలో చేరారు. ఇప్పటికై అక్కడ సుమారు 15 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ప్రతి రోజూ శింగనమల కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌, తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదుల సంఖ్యలతో చిన్నారులు జ్వరాలతో చికిత్స కోసం వస్తున్నారు. అంతేకాకుండా చాలా మంది ప్రైవేట్‌ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

అపరిశుభ్రతే కారణం

మండలంలోని 19 పంచాయతీల్లో అపరిశుభ్రత తొలగించడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏనాడూ పంచాయతీలకు పైసా కేటాయించింది లేదని, కేంద్రం ఇచ్చిన నిధులను సైతం ఇవ్వలేదని ఆ పార్టీ సర్పంచులే వాపోతున్నారు. వచ్చిన కొద్దిపాటి నిధులు గ్రామంలో పారిశుధ్య కార్మికుల జీతాలకే సరిపోతుందన్నారు. తమ మీద నమ్మకంతో సర్పంచులుగా ఎన్నుకుంటే చిన్న చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితుతో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

గత టీడీపీ ప్రభుత్వంలో సీజన్‌వారిగా గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసే వారని, అయితే వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్నా.. వైద్య ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. 20 రోజుల నుంచి డెంగీ, వైరల్‌ జర్వాలతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నా.. ఎక్కడ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్‌ సిలిండర్‌ లీకై నలుగురికి గాయాలు

గాయపడిన వారిలో అవ్వ, మనవడు, మనవరాళ్లు

ఉలిక్కిపడ్డ కాలనీ

హిందూపురం, మార్చి 10 : పట్టణంలోని బ్యాంక్‌ కాలనీలో ఆదివారం ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్‌ సిలిండర్‌ లీకై ఓ వృద్ధురాలు, ఆమె ఇద్దరు మనుమరాళ్లు, మనవడికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నా యి. బ్యాంక్‌ కాలనీలో ఆనందప్ప, లక్ష్మీదేవి అనే వృద్ధులు ఓ రేకుల షెడ్డులో నివాస ముంటున్నారు. వారి కుమారుడు, కుమార్తె కుటుంబాలతో పక్కనే వేర్వేరుగా నివాస ముంటున్నారు. లక్ష్మీదేవి ఆదివారం ఉదయం గ్యాస్‌ స్టవ్‌పై టీ తయారుచేసింది. గ్యాస్‌ ఆఫ్‌ చేయడం మరిచిపోయింది. టీ తాగిన తరవాత వారిద్దరు బయట కు వెళ్లిపోయారు. కొంతసేపటి తరువాత ఆమె తన కుమార్తె కొడుకు, తన కుమారుడి ఇద్దరు కూతుళ్లతో కలిసి షెడ్‌లోకి వెళ్లింది. షెడ్‌లో గ్యాస్‌ వాసన వస్తుండడం వారు గమనించారు. వెంటనే లైటుస్విచ్‌ ఆన్‌చేశారు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. షెడ్డుకున్న రేకులు పైకి లేచాయి. ఇంటి తలుపులు బద్దలై కిందపడ్డాయి. స్థానికులు వెంటనే గమనించి ఆ ఇంట్లోకి వెళ్లారు. లోపల లక్ష్మీదేవమ్మతోపాటు ఆమె మనవరాళ్లు అఖిల, వర్షిత, మనువడు భరత్‌ గాయాలతో కనిపించారు. వెంటనే వారిని బయటకు తీసుకొచ్చి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్సలు అందించారు. లక్ష్మీదేవికి తీవ్రగాయాలుకాగా మనువడు, మనువరాళ్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

భారీగా నగదు, మద్యాన్ని ఎత్తుకెళ్లిన దొంగలు

బత్తలపల్లి, మార్చి10: ప్రభుత్వ మద్యం దుకాణంలో భారీగా నగదు, మద్యం చోరీ జరిగింది. ఈ ఘటన బత్తలపల్లి మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఆరోహణరావు ఎక్సైజ్‌ సీఐ గౌరీప్రియ ఘటనా స్థలాన్ని ఆదివారం ఉదయం పరిశీలించారు. గుర్తు తెలియని దుండగులు ఓ కారులో వచ్చి మద్యం దుకాణం తలుపులను పగుల కొట్టి లోపలకు ప్రవేశించి, అందులోని 5 సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌ను ఎత్తికెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే లాకర్‌ను పగులకొట్టి రూ.10లక్షలకుపైగా నగదు, రూ.3లక్షల విలువజేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీస్‌ అధికారులు క్లూస్‌ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. సూపర్‌వైజర్‌ విజయ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



చోరీ జరిగిన మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

వడదెబ్బతో వ్యక్తి మృతి



ఓబులేసు (ఫైల్‌)

పామిడి, మార్చి 10: మండల కేంద్రంలో ఓబులేసు(48) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని పొగరూరు గ్రామానికి చెందిన ఓబులేసు పామిడిలోనే స్థిరపడ్డాడు. 44వ జాతీయ రహదారిపై పండ్లు అమ్ముకుంటూ, కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. రోజు మాదిరే పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. ఎండతీవ్రతకు పామిడి రైల్వేస్టేషన్‌ వద్ద సొమ్మసిల్లిపడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన అతనిని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య గోవిందమ్మ, కుమారుడు వంశీకృష్ణ ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీఎస్‌ఐ కేంద్రంలో స్ట్రాటిగ్రాఫిక్‌ నమూనా ఏర్పాటు

గుంతకల్లు (వజ్రకరూరు), మార్చి 10: వజ్రకరూరులోని జియలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా (జీఎస్‌ఐ) వజ్రాల పరిక్రమణ (ప్రాసెసింగ్‌) కేంద్రంలో భూగర్భ ధాతువులను ప్రతిబింబించే (స్ట్రాటిగ్రాఫిక్‌) రాతి నమూనాల కట్టడాన్ని ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం జీఎస్‌ఐ దక్షిణ ప్రాంత ఏడీజీ సీహెచ్‌ వెంకటేశ్వర రావు, ఏపీఎస్‌యూ డిప్యూటీ జనరల్‌ ఎస్‌ఎన్‌ మహపాత్రో ఆధ్వర్యంలో నమూనా నిర్మాణాన్ని ఆవిష్కరించారు. వీరు మాట్లాడుతూ భూగర్భ ధాతువుల ప్రాథమిక దశను వివరించగలిగే చారిత్రక ప్రాంతంగా (ప్రోటిరోజోయిక్‌ బేసిన్‌), దేశంలో రెండవదిగా పేరుగాంచిన కడప బేసిన్‌లోని రాతి నమూనాలను ఈ కట్టడంలో నిక్షిప్తం చేసినట్లు తెలిపారు. వజ్రకరూరులోని జీఎస్‌ఐ వజ్రాల ప్రాసెసింగ్‌ కేంద్రంలో ఈ స్ట్రాటిగ్రాఫిక్‌ కాలంను ఏర్పాటుచేయడం ద్వారా భౌగోళిక శాస్త్ర ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. స్థానిక విద్యార్థులకు ఈ స్ట్రాటిగ్రాఫిక్‌ నిర్మాణాన్ని చూపారు. వారికి విషయావగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎస్‌ఐ అధికారులు డాక్టర్‌ అపూర్వ బెనర్జీ, రాకుశ్‌ కుమార్‌ గుప్త, తరుణ్‌ కోలే, శ్రీపాద బాల్‌, సుమన మండల్‌, ఏపీ సహాయ జియాలజిస్టు పీ హరికృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిదే విజయం: పల్లె



విలేకరులతో మాట్లాడుతున్న పల్లె రఘునాథ రెడ్డి

పుట్టపర్తి, మార్చి 10 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి విజయదుందుభి మోగిస్తాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అవినీతి, అక్రమాలు, దందాలతో భ్రష్టు పట్టిందన్నారు. చివరికి రాజధాని కూడా లేని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయన్నారు. ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమన్నారు. ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం కేవలం జగన్‌రెడ్డి, విజయ్‌సాయిరెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, ధనుంజయరెడ్డికే పరిమితమైందన్నారు. తల్లికి చెల్లికి న్యాయం చేయలేక బయటకు గెంటేసిన జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారో ప్రజలు ఆలోచించాలని ఆయన సూచించారు.

ఉద్యోగాల కల్పన టీడీపీతోనే సాధ్యం: కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

కదిరిఅర్బన్, మార్చి 10: ఉపాధి, ఉద్యోగాల కల్పన టీడీపీతోనే సాధ్యమని, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. పట్టణంలో ఆదివారం ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం టీడీపీతోనే సాధ్యమన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పట్టిందన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని గద్దెనెక్కిన జగన్ ఆ తర్వాత నిరుద్యోగులను మోసం చేశారన్నారు. వైసీపీ పాలకులు గంజాయి, మాదక ద్రవ్యాల మాఫియాను ప్రోత్సహిస్తూ, వేలాది మంది యువత జీవితాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు సృష్టించాలన్నా, ఉపాధి కల్పించాలన్నా చంద్రబాబుకే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, జనసేన బ్లూమూన్ శివశంకర్, వాల్మీకి పాఠశాల కరెస్పాండెంట్ అనికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



35వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, మార్చి 10: రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరగాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని 35 వార్డు ఎర్రగుట్టపల్లిలో ఆదివారం ఆమె ఇంటింటా పర్యటించి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆమె వెంట నాయకులు కొయ్య రాజేంద్రనాయుడు, ఫర్వీనాభాను, డైమండ్ ఇర్షాన్, మందాల గోపాల్, మెపూరి శెట్టి చంద్రశేఖర్, గంగయ్యనాయుడు, గుప్తా గోపాల్‌నాయుడు, ఏసీబీ చౌదరి, కే. శ్రీనివాసులు, గంగప్ప, శ్రీరాములు, గుంగులప్ప, రాజశేఖర్‌బాబు, విశ్వనాథ్, కల్పనచౌదరి, బశెట్టి మహేంద్ర, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ఉమాదేవి, సుశీల, ఫరీదా, ప్రేమలత తదితరులు ఉన్నారు.

మినీబస్సు బోల్తా.. ఒకరి మృతి



శివకుమార్ (ఫైల్)

ధర్మవరం, మార్చి 10: పట్టణంలోని పోతుకుంట ఫ్లైఓవర్‌పై ఆదివారం మినీ బస్సు బోల్తాపడడంతో శివకుమార్(36) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లిలోని టీచర్స్‌కాలనీకి చెందిన శివకుమార్ శివమాల దీక్ష విరమణ కోసం కనగానపల్లికి చెందిన తోటి శివమాల ధరించిన మిత్రులతో కలిసి మినీబస్సులో రెండు రోజుల క్రితం శ్రీశైలం వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగివచ్చి తోటి మాలధారులను కనగానపల్లిలో వదిలేందుకు వెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి అతను ధర్మవ రానికి వస్తుండగా.. పోతుకుంట ఫ్లైఓవర్ మలుపు వద్ద బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య చంద్రకళ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

ధర్మవరం, మార్చి 10: కరాటేతోనే ఆత్మరక్షణ పెంపొందించుకోవచ్చని మల్టీస్టార్ ఆలిండియా బుడోఖాన్ అకాడమీ కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు జరిగింది. ఇందులో 35మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలువురు విద్యార్థులకు ప్రతిభ కనబరచి ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ బెల్టులు సాధించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధర్మవరం, మార్చి 10: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1998-99వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం కలిశారు. అదే పాఠశాలలోనే సుమారు 25ఏళ్ల తరువాత కలిసి ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. నాటి గురువులు నాగప్రసన్న, పోలయ్య, నాగేశ్, లక్ష్మీదేవి, శ్రీదేవి, మేరి, సుధాకర్‌గౌడ్, నారాయణస్వామి, వెంగముని, వెంకటేశ్, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, రంగయ్య, గిరి, కొండయ్య, వెంకటస్వామి, అశ్వర్థనారాయణ, సబీరాకానుమ్, రామలింగయ్యలను ఘనంగా సత్కరించారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

సంపద సృష్టించే నాయకుడు చంద్రబాబు

● భవిష్యత్తు గ్యారెంటీలో టీడీపీ నాయకులు



18వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ధర్మవరం, మార్చి 10: సంపద సృష్టించే నాయకుడు చంద్రబాబు అని, ఆయన వస్తేనే రాష్ట్రంలో ప్రగతి పథంలో పయనిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డులో ఆదివారం టీడీపీ పట్టణ ప్రచార కమిటి ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సంపద సృష్టించే నాయకుడు చంద్రబాబేనన్నారు. ఆయన అధికారంలోకి వస్తే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, కత్తులబాబ్జీ, కత్తుల సునీత, బీబీ, మాధవరెడ్డి, బొట్టుకిష్ట, గోసలశ్రీరాములు, అత్తార్ రహీంబాషా, తోటనారాయణస్వామి, పోసాని శ్రీనివాసులు, పూజారి పోతలయ్య, క్లస్టర్ రామాంజి, అమర్నాథ్‌చౌదరి, గంగాధర్, పూజారి నిర్మల, కవల నాగరాజు, సూర్యనారాయణ, కుళ్లాయప్ప, ఆంజనేయులు, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం



నల్లమాడలో సూపర్ సిక్స్ పథకాల కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



ఓబుళదేవరచెరువులో..

నల్లమాడ, మార్చి 10: ప్రతినిరుపేదకు సంక్షేమపథకాలు అందాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ మాట్లాడుతూ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. యువతకు 20లక్షల ఉద్యోగావకాశాలు, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, ప్రతి విద్యార్థికి యేడాదికి రూ.15వేలు, ప్రతి రైతులకు యేడాదికి రూ.20వేలు, ఒక్కో కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.15వందలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు కార్యకర్తలకు సూపర్ సిక్స్ పథకాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుట్టి నాగభూషణంనాయుడు, కేశవరెడ్డి, పుట్ల రవీంద్ర, కులశేఖర్‌నాయుడు, మైలే రామచంద్ర, మైలే హరి, శివప్రసాద్‌రెడ్డి, గంగన్న, రవి, రమేష్‌రెడ్డి, హరిప్రసాద్, ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, చిన్నబాషా తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా తెలియజేయాలి

ఓబుళదేవరచెరువు: టీడీపీ చెందిన ప్రతి బూత్ కన్వీనర్, కార్యకర్తలు ఇంటింటా తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించాలని మండల కన్వీనర్ జయచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జిలు నారప్పరెడ్డి, చికెన్‌షాన్ సూచించారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం వారు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆదేశాల మేరకు సూపర్ సిక్స్ పథకాల కిట్లను కార్యకర్తలకు అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా సూపర్ సిక్స్ పథకాల గురించి తెలియజేయడంతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండలప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, నాయకులు మండోజీ ఆర్ఫీఖాన్, నిజాం, క్రిష్ణమూర్తి, సోదీనాగరాజు, పోగాకు షాన్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : ఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, మార్చి 10: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు, ప్రజల్లో మనోధైర్యం నింపేందుకు గాను జిల్లాలో సాయిధ బలగాల చేత కవాతు నిర్వహిస్తున్నామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మూడురోజులుగా హిందూపురం, ధర్మవరం, కొత్తచెరువులో బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సాయిధ బలగాల చేత కవా తు నిర్వహించామన్నారు. ఆదివారం రామగిరిలో నిర్వహించామన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కు ను ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఇందుకు పోలీసు సాయిధ బలగాల భద్రత, భరోసా ఉంటుందని తెలియజేసేందుకు ఈకవాతును నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాప్రజలు సైతం భద్రతా దళాలకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని, ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఓబుళదేవరచెరువు, మార్చి 10: మండలంలోని వడ్డివారిపల్లిలో గల కేజీబీవీలో ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల స్పెషలాఫీసర్ ఆర్. గీతాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 వ విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 వ తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్‌ద్వారా సమాచార ఇస్తామని, లేదా పాఠశాలలో నోటీసు బోర్డులో పేర్లు పొందుపరుస్తామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం యేడాదికి రూ.లక్షా 20వేలకు మించకూడదని తెలియజేశారు.

ఆటో బోల్తా.. ఒకరికి తీవ్రగాయాలు

ఓబుళదేవరచెరువు, మార్చి 10: మండలంలోని మల్లాపల్లి కొత్తరోడ్డు వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓడీసీ నుంచి మిట్టపల్లికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మార్గంమధ్యలోని మల్లాపల్లి కొత్తరోడ్డు వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు వెంటనే ఆటోలో ఉన్న ప్రయాణికులను వెలికితీశారు. వీరిలో మిట్టపల్లికి చెందిన భార్గవ్‌కు తీవ్ర గాయాలవడంతో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

అలరించిన భక్తిగీతాలు



పుట్టపర్తి, మార్చి 10: సత్యసాయి విద్యార్థులు భక్తిగీతాల ఆలాపనతో భక్తులను ఆకట్టుకున్నారు. పట్టణంలోని సాయికుల్వంత్ హాల్లో ఆదివారం సాయంత్రం కర్ణాటకలోని ముద్దెనహళ్లికి చెందిన సత్యసాయి విద్యార్థులు విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా భక్తిగీతాల ఆలాపన చేపట్టారు. సుమారు గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై మధురగానం చేసి భక్తులను అలరించారు. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

తనకల్లులో చోరీ

● మూడు తులాల బంగారం, రూ. 20వేల నగదు అపహరణ



బీరువా తాళాలు పగలకొట్టిన దృశ్యం

తనకల్లు, మార్చి 10: మండలకేంద్రంలోని జాతీయ రహదారి 44 మెయిన్ రోడ్డు పక్కనున్న ఓ ఇంటిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ ధరణిబాబు ఆదివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన రత్నమయ్య శెట్టి ఇంటిలోనే ముందు గదిలో కిరాణా షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆయన రెండురోజుల క్రితం ఇంటికి, దుకాణానికి తాళాలు వేసి బెంగళూరులో ఉన్న తన కుమారుడిని చూడ్డానికి వెళ్లాడు. కాగా శని వారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టడాని కి ప్రయత్నించి విఫలమయ్యారు. తర్వాత దుకాణానికి సంబంధించిన షట్టర్ తాళాలు పగలకొట్టి దుకాణంలోంచి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటిలో బీరువా తాళాలు పగలకొట్టి అందులో ఉన్న 3 తులాల బంగారం, రూ.20వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పనిమనిషి చెత్త శుభ్రం చేయడానికి వచ్చి తాళాలు పగలకొట్టిన విషయాన్ని గుర్తించి, పక్కనే ఉన్న బంధువులకు సమాచారం అందించింది. బంధువులు పోలీసులకు, బెంగుళూరులో ఉన్న రత్నమయ్య శెట్టికి విషయం తెలిపారు. రత్నమయ్య శెట్టి బెంగళూరు నుంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్‌లను రప్పించి విచారించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తిమ్మమాంబ ఆలయ హుండీ లెక్కింపు

నంబులపూలకుంట, మార్చి 10: మండలంలోని గూటిబైలు గ్రామంలో గల తిమ్మమాంబ ఆలయ హుండీని ఆదివారం లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా మూడురోజుల పాటు మర్రిమాను వద్ద ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ క్రమంలో వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఆదాయం రూ.3.02 లక్షలు వచ్చిందన్నారు. అయితే మహాశివరాత్రికి రూ.3.62 లక్షలు ఖర్చు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, నారాయణస్వామి, ఈశ్వర్ ఉన్నారు.

167 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం, మార్చి 10: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ వారు బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 167 మంది కంటి సమస్య ఉన్నవారికి వైద్యనిపుణుడు ఆర్యపాండే కంటి పరీక్షలు చేసి 112 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, ప్రతినిధులు సుదర్శన్ గుప్తా, నరేంద్రరెడ్డి, ప్రసన్నకుమార్, వెంకటేశులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పెద్దమ్మ జాతర

ముదిగుబ్బ, మార్చి 10: మండల కేంద్రంలో పాతూరులో పెద్దమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా మూడు రోజుల పాటు జాతర ను వైభవంగా నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి మూలవిరాట్‌ను వేపమండలు, బంతిపూలు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు జ్యోతు లు, బోనాలు సమర్పించారు. అనంతరం జం తుబలులు ఇచ్చి మొ క్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద గాజులు, ఆట బొమ్మలు, తినుబండారాల దుకాణాలు వెలిశాయి. స్థానికులే కా కుండా వివిధ ప్రాం తాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది.



జాతరలో భక్తజనంతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



పోలీసుల అదుపులో ఉన్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

తనకల్లు, మార్చి 10: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. రైలురోకో చేయడానికి బయలు దేరిన సీపీఎం, రైతు సంఘం నాయకులను ఆదివారం ఎస్ఐ ధరణిబాబు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకుని ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్యగా ఖండించారు. గత 13రోజులుగా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీవద్ద రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా రైలు రోకో చేయడానికి ప్రయత్నించడం నేరం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్ల చట్టాలను రద్దుచేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా సభ్యులు వీవీ రమణ, నాయకులు రమణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఒంటెద్దు వేమన్న తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి అమావాస్య పూజలు

ధర్మవరంరూరల్, మార్చి10: పట్టణంలోని కేపీటీ వీధిలో చక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు, కుష్మాండ దీపోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ధనుంజయాచారి కాలభైరవుడిని ప్రత్యేక ంగా అలంకరించి విశేషపూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దీపాలు వెలిగించారు. అమావాస్య రోజున దీపాలు వెలిగించడం వల్ల అన్ని దోషాలు తొలగుతాయని పూజారి తెలిపారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.



కాలభైరవుడికి పూజలు చేస్తున్న భక్తులు

కాళికాంబకమటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాళికాంబకమటేశ్వరస్వామి

రొళ్ల, మార్చి 10: మండలంలోని రత్నగిరిలో వెలసిన కాళికాంబ కమటేశ్వరస్వామికి మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులే కాకుండా సమీప కర్ణాట క ప్రాంతం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయించారు.

కొల్హాపురమ్మను దర్శించుకున్న పరిపూర్ణానంద స్వామి



పరిపూర్ణానందస్వామిని సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

రొళ్ల, మార్చి 10: కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామీజీ ఆదివారం మండలంలో పలు దేవాలయాలను సందర్శించారు. కొల్హాపురి మహాలక్ష్మికి, కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు జరిపించారు. అనంతరం సీఎం గట్టుకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడి తోటలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్య క్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముద్దరాజు, జన సేన నాయకుడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు వాసి ఆత్మహత్య

హిందూపురం, మార్చి 10: స్థానిక తూమకుంట పారిశ్రామిక వాడలో తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన లోకేష్ దొరైరాజు(38) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగుచూసింది. అప్‌గ్రేడ్ స్టేషన్ ఏఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల మేరకు... లోకేష్ దొరైరాజు నాలుగేళ్ల కిందట ముద్దిరెడ్డిపల్లికి వచ్చి రేషంకు కలర్ అద్దే పని చేసేవాడు. ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. అప్పుడప్పుడు పనిచేస్తూ మిగిలిన రోజుల్లో మద్యంతాగి ఎక్కడ పడితే అక్కడ ఉండేవాడు. అతడికి మూర్ఛవ్యాధి కూడా ఉండేది. ఈ నేపథ్యంలో బెంగళూరులో బంధువుల ఇంటికి వెళ్తానని అతడు తన తమ్ముడు గుణశేఖర్ దొరైరాజుకు చెప్పి శనివారం సాయంత్రం వెళ్లాడు. కానీ తూమకుంట చెక్‌పోస్టులో బస్సు దిగాడు. టెక్స్‌పోర్టు గార్మెంట్స్ సమీపంలో ఓ కొట్టానికి ఉన్న కర్రకు పంచెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా ఆదివారం ఉదయం వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలతో తమ్ముడు గుణశేఖర్‌కు సమాచారం అందించారు. దీంతో తమ్ముడు మృతుడిని గుర్తించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా... వ్యక్తికి గాయాలు

హిందూపురం అర్బన్, మార్చి 10: స్థానిక పూలకుంట వద్ద ఆదివారం ఆటో బోల్తా పడి ఓ వ్యక్తికి కాలు విరిగింది. హిందూపురం మండలం నరసాపురానికి చెందిన గంగాధరప్ప అనే ఆటో డ్రైవర్ ఆటోనడుపుతూ... లేపాక్షి వైపు నుంచి హిందూపురం వైపు వెళ్తున్నాడు. పూలకుంట వద్ద ఉన్న లోటస్ పాఠశాల క్రాస్‌లో ఆటో అదుపు రోడ్డు పక్కన గుంతలో పడింది. ఈ ఘటనలో గంగాధరప్ప కాలు విరిగింది. స్థానికులు గమనించి 108 సాయంతో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల సీజ్

పెనుకొండ రూరల్, మార్చి 10: మండలంలోని కియ కార్లపరిశ్రమ సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లను సీజ్ చేసినట్లు కియ ఇండస్ట్రియల్ ఎస్ఐ రంగడు ఆదివారం తెలిపారు. కియా పరిశ్రమ సమీపంలోని యర్రమంచి పొలాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్



సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌ను స్టేషన్‌కు తరలించిన పోలీసులు

పెనుకొండ, మార్చి 10 : ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా... సీపీఎం, అనుబంధ సంఘాలు సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులకు పోలీసులు ఆదివారం నోటీసులు అందించి, ముందస్తు అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కు ఉదయాన్నే ఇంటివద్దకు వెళ్లి నోటీసులు అందజేసి అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్ట్‌ల ద్వారా ఉద్యమాన్ని ఆపలేరన్నారు. పోలీసుల చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

నిరంకుశ పాలనను తుదముట్టించేందుకే పొత్తు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



సవితను అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పెనుకొండ టౌన్, మార్చి 10 : వైసీపీ నిరంకుశ పాలనను తుదముట్టించేందుకే తెలుగుదేశం, జనసేన పార్టీలు బీజేపీతో కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె ఆదివారం పార్టీ స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఈసారి జరిగే ఎన్నికలో చారిత్రాత్మక విజయం సాధిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అందరూ స్వాగతించాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల్లో మననేత చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నార న్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టారన్నారు. అప్పుల ఆంధ్రగా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కులంతో సంబంధం లేకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి పాలన నడిచిందన్నారు. బీసీలను వైసీపీ ఎంత హీనంగా చూసిందో జగ్గా క్రిష్ణమూర్తి మాటల్లోనే విన్నామన్నారు. అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను గద్దె దించేందుకు మూడు పార్టీలు కలిసి వచ్చాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై కేంద్రం పెద్దల కు నమ్మకం ఉందని అందుకే పొత్తుకు ఆహ్వానించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రొద్దం నాయకులు చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, నీరుగంటి చంద్రశేఖర్, వెంకటేశ్, కిష్టప్ప, సూరీ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పరిగి మండలం కాలువపల్లికి చెందిన వైసీపీకి చెందిన 15మంది కుటుంబసభ్యులు టీడీపీలో చేరారు. వారికి సవిత టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే పరిగి మండలం బీరేపల్లి, నర్సాపురం, పరిగి, యర్రగుంట, రొద్దం మండలం దొడగట్ట పంచాయతీలకు చెందిన టీడీపీ, జనసేనపార్టీ కార్యకర్తలు సవితను కలిశారు. పార్టీకోసం అహర్నిశలు కష్టపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ టీడీపీ ఇటీవల విడుదల చేసిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యం చేయాలని కోరారు. వైసీపీ నాయకులు ఇప్పటికే వలంటీర్ల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని వారి మాయమాటల్లో పడితే మరో 20ఏళ్లు ఏపీ వెనక్కు వెళ్తుందన్నారు.

నడి రోడ్డులో గుంత

ప్రజల్లో ప్రమాద భయం
మరమ్మతులు చేయాలని డిమాండ్

గోరంట్ల, మార్చి 10: పట్టణంలోని బస్టాండ్ కూడలిలో మార్కెట్‌వైపు వెళ్లే రహదారిపై మురు గునీటి కాలువకు ఏర్పాటు చేసిన రంధ్రానికి అమర్చిన ఐరన్ చాంబర్ ప్లేటు దెబ్బతింది. దీంతో ఆ రహదారిపై వాహనదారులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పట్టణ ంలో మార్కెట్ వీధి, ప్రధాన రహదారిని బస్టాండ్ కూడలిలో కలుపుతూ చిత్రావతినదిలోకి మురుగు నీరు తరలించేందుకు డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేశారు. ఆ కాలువలో చిక్కుకున్న చెత్తాచెదారం తొలగించేందుకు బస్టాండ్ కూడలిలోని లాడ్జి ఎదుట చాంబర్‌ను ఏర్పాటుచేసి, ఐరన్ ప్లేట్ బిగించారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడినపుడు మార్కెట్ వీధిలోని బైపాస్ దారిని ఉపయోగిస్తారు. హిందూపురం రోడ్డు నుంచి బైపాస్ ద్వారా కదిరి రోడ్డు, పుల్లేరు. శిగిరెడ్డిపల్లి, సోమగడ్డ, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లడానికి ఈ రహదారి ప్రధానంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలో పెద్దఎత్తున స్వామి ఊరేగింపు సాగింది. దీంతో పోలీసులు వాహనానాల దారి మళ్లించారు. గతం లోనే కూడలిలోని చాంబర్ పాక్షికంగా దెబ్బతిని ఉండేది. ఇప్పుడు భారీ వాహనాలు వెళ్లడంతో చాంబర్ ప్లేట్ వంకర్లు తిరిగి పైకి లేచి ప్రమాదకరంగా మారింది. దీని వలన నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ కూడలిలో ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి చాంబర్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ కూడలిలో దెబ్బతిన్న చాంబర్ ప్లేట్

14న సభను విజయవంతం చేయండి : కాంగ్రెస్



ప్రచారరథాన్ని ప్రారంబిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధాకర్

మడకశిర, మార్చి 10 : నియోజకవర్గంలోని స్థానిక ప్రతినిధులతో ఈ నెల 14న సభను నిర్వహిస్తున్నామని, దానిని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కే సుధాకర్ కోరారు. మడకశిర మండలం నీలకంఠాపురంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాన్ని ఆదివారం ఆయన ప్రారంబించారు. ముందుగా నీలకంఠాపురంలోని దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ... నియోజక వర్గంలో నిర్వహించే ప్రతి గడప గడపకు కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పాల్గొంటారన్నారు. మడకశిర పట్టణంలోని ఆదిరెడ్డి పాళ్యంలో ఈనెల 14న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లో 340 గ్రామాలు, 20 నగరపంచాయతీ వార్డుల ప్రతినిధుల సభ అనంతరం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార షెడ్యూల్ని విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదుపు ఏజెన్సీల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గ సభ్యులు

హిందూపురం, మార్చి 10 : జాతీయ పొదుపు ఏజెన్సీల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. పట్టణంలోని విద్యానగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు భీమిశెట్టి కృష్ణమూర్తి, కార్యదర్శి మేడ శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేశారు. వీరితోపాటు హిందూపురం అసోసియేషన్ అధ్యక్షురాలు లీలాబాయి, కార్యదర్శి అమర్నాథ్, కోశాధికారి శ్రీరాములు పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఎల్ఐ తపాలాశాఖ డీఓ నరసింహమూర్తి, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన జిల్లా పొదుపు ఏజెంట్ల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భీమిశెట్టి క్రిష్ణమూర్తి, కార్యదర్శి మేడా శ్రీనివాసులు, హిందూపురం పీఎల్ఐ డీఓ నరసింహమూర్తి మాట్లాడుతూ... పోస్టల్ డిపార్టుమెంట్‌కు, ప్రజలకు ఏజెంట్లు వారధులుగా ఉంటారన్నారు. పొదుపులో రకాలు వాటిని ఏ విధంగా వినియో గించుకోవాలనే విషయాలను ప్రజలకు ఏజెంట్లు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి : ఎంఈఓలు

పెనుకొండ, మార్చి 10: ప్రభుత్వం ఆర్‌టీఈ121సిలో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి సబంధించి మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఒకటో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవ చ్చని మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, సుధాకర్ ఆదివారం తెలిపా రు. అనాథ పిల్లలకు, హెచ్ఐవీ ప్రభావితులకు ఐదు శాతం సీట్లు, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీనవర్గాలు, మైనార్టీలకు 6శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌టీల ద్వారా క్లస్టర్ పరిధిలో ప్రజలకు తెలియజేయాలన్నారు.

రేపు రక్తదాన శిబిరం

గోరంట్ల, మార్చి 10: పట్టణంలోని ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో ఈనెల 12న మేగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భక్తవత్సలం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరంలో... 18యేళ్లు నిండి ఆరోగ్యవంతు లైన యువత రక్తదానం చేయాలని కోరారు. రక్తహీనత కలిగినవారికి, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం వలన మరొకరి ప్రాణాలు కాపాడి, వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, మార్చి 10: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎ లాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వే చ్ఛగా తమ ఓటు హ క్కు వినియోగించుకునేందుకు, ప్రజల్లో మనోధైర్యం నింపేందుకు గాను జిల్లాలో సాయిధ బలగాల చే త కవాతు నిర్వహిస్తున్నామని ఎస్పీ మాదవరెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరుసగా గత మూడురోజులుగా హిందూపురం, ధర్మవరం, కొత్తచెరువులో బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సాయిధ బలగాల చేత కవా తు నిర్వహించామన్నారు. ఆదివారం రామగిరిలో నిర్వహించామన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఇందుకు పోలీసు సాయిధ బలగాల భద్రత, భరోసా ఉంటుందని తెలియజేసేందుకు ఈకవాతును నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాప్రజలు సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

తనకల్లులో చోరీ

- మూడు తులాల బంగారం, రూ. 20వేల నగదు అపహరణ

తనకల్లు, మార్చి 10: మం డలకేంద్రంలోని జాతీయ రహదారి 44 మెయిన్ రోడ్డు పక్కనున్న ఓ ఇంటిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ ధరణిబాబు ఆదివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన ర త్నమయ్య శెట్టి ఇంటిలోనే ముందు గదిలో కిరాణాషాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. రెండురోజుల క్రితం ఇంటికి, దుకాణానికి తాళాలు వేసి బెంగళూరులో ఉన్న కుమారుడిని చూడ్డానికి వెళ్లాడు. శనివారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. తర్వాత దుకాణం షట్టర్ తాళాలు పగలకొట్టి దుకాణంలోంచి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో బీరువా తాళాలు పగలకొట్టి అందులో ఉన్న 3 తులాల బంగారం, రూ.20వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పనిమనిషి చెత్త శుభ్రం చేయడానికి వచ్చి విషయాన్ని గుర్తించి, పక్కనే ఉన్న బంధువులకు సమాచారం అందించింది. బంధువులు పోలీసులకు, బెంగుళూరులో ఉన్న రత్నమయ్య శెట్టికి తెలిపారు. రత్నమయ్య శెట్టి బెంగళూరు నుంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్‌లను రప్పించి విచారించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పనిచేయని తాగునీటి ప్లాంట్

ఇబ్బందులు పడుతున్న చందకచర్ల వాసులు



నాలుగు నెలలుగా మూతపడిన శుద్ధజల ప్లాంట్

మడకశిర రూరల్, మార్చి 10: మండలంలోని చందకచర్ల పంచాయతీ కేంద్రంలో ఉన్న శుద్ధజల తాగునీటి ప్లాంటుకు మరమ్మతులు చేయించి తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. గ్రామంలో ఉన్న శుద్ధిజల ప్లాంటు చెడి పోయి నాలుగు నెలలు అవుతోంది. దీంతో తాగునీరు లేక గ్రామస్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే తాగునీటి ప్లాంటు మరమ్మతుల గురించి పంచాయతీ అధికారులుకానీ, పాలకులు కానీ ఎవరూ పట్టించుకోవడం లేదనా ఆ గ్రామస్థులు వాపోతున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించక, ప్లాంట్ మరమ్మతులు చేపట్టక పోవడంతో తాగునీటికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలా మంది మడకశిర పట్టణానికి వెళ్లి ద్విచక్రవాహనంలో శుద్ధిజలాన్ని తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. మిగిలిన వారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గ్రామంలోకి వచ్చే తాగునీటి వాహనం నుంచి బిందె నీటిని రూ.10కి , క్యాన్ నీటిని రూ.15కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో శుద్ధి జల ప్లాంట్ ఉన్న ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో ప్లాంటు మరమ్మతులు చేయించలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై గ్రామ స్థులు మాట్లాడుతూ మండలంలోని మిగిలిన పంచాయతీల్లో ఉన్న ప్లాంట్లు పనిచేస్తున్నాయికదా... వాటికి నిధుల కొరత లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. చెడిపోయిన తాగునీటి ప్లాంటుకు మరమ్మతులు చేయించి, గ్రామంలో శుద్ధిజ లాన్ని అందించాని గ్రామస్థులు కోరుతున్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు చారిత్రాత్మకం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి

పెనుకొండ, మార్చి 10 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి పోటీచేయడం చారిత్రాత్మకమైనదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని పార్టీ సభ్యులుగా తామందరం స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కొత్త నిర్ణయం తీసుకున్నారన్నారు. వైసీపీ నిరంకుశ పాలనకు తుదముట్టించేందుకు మూడు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయన్నారు. సీఎం జగన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారన్నారు. అన్నపూర్ణ అయిన రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. కులంతో సంబంధంలేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జగన్ ప్రభుత్వంలోనే అధికమయ్యాయన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వం అంటే కేవలం జగన్‌రెడ్డి, విజయ్‌సాయిరెడ్డి, సజ్జలరామక్రిష్ణారెడ్డి, ధనుంజయరెడ్డిగా మారిందన్నారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లులాంటిదని, మొన్న జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఇది మరోసారి రుజువైందన్నారు. చంద్రబాబు పాలన ఆంధ్రప్రదేశ్‌కు రక్షణగా ఉంటుందని తమ నమ్మకమన్నారు. అతి పెద్ద జాతీయ పార్టీతో పాటు దేశం మొత్తం టీడీపీకి మద్దతుఇస్తుందన్నారు.

నేడు టీడీపీ నియోజకవర్గ సమావేశం

పెనుకొండ, మార్చి 10: పట్టణంలోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి కార్యాలయంలో సోమవారం టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ, మండల కన్వీనర్లు సిద్దయ్య, రవిశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకే ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు సమావేశం నిర్వహిచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి టీడీపీ రాష్ట్ర, జిల్లా నియోజకవర్గం, మండల, గ్రామస్థాయి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గోరంట్ల: పెనుకొండ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరగనున్న సమావేశానికి పార్టీశ్రేణులు తరలి రావాలని టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు జరిగే సమావేశానికి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం



కంబాలపల్లిలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, మార్చి 10 : మండలపరిధిలోని శ్యాపురం, కంబాలపల్లిలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మండల పరిధిలోని శ్యాపురం గ్రామంలో పోతులప్ప దేవాలయానికి పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి సవిత తరపున కరపత్రాలు అందించి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. వైసీపీ ప్రభుత్వం అందించిన పథకాల్లో కోతలు విధిస్తూ గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. కలలకు రెక్కలు అనే పథకం ద్వారా ఇంటర్ తరువాత ఉన్నత చదువులు చదివే విద్యార్థినులకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పించి, వడ్డీని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, రాష్ట్ర ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు టైలర్ ఆంజనేయులు, పెనుకొండ మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, నాయకులు నరసింహులు, సర్పంచ్ మంజునాథ్, నాగరాజు, బీదానిపల్లి వెంకటేశ్, అక్బర్‌సాబ్, చంద్రశేఖర్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి'

పెనుకొండ, మార్చి 10 : మహిళలు చదువుతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని ప్రముఖ కవి డాక్టర్ పసనూరి రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాష ఆధ్వర్యంలో ఆదివారం జూమ్ వేదిక ద్వారా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. కవి సమ్మేళనానికి సుమనజయంతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహితీ అకాడమి పురస్కారగ్రహీత డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ.. మహిళా సాధికారతే దేశ భవిష్యత్తుకు నాంది అని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి ప్రసిద్ధ కవి శ్రీనివాసగౌడ్, అనంతకవుల వేదిక అధ్యక్షుడు చంద్రశేఖర్ శాస్త్రితోపాటు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 22మంది కవులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. కవులు సుబ్రహ్మణ్యం శర్మ, రఘువీరప్రతాప్ లక్ష్మీశ్యామ్, పుష్పలత, ముద్దరంగప్ప, శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతా నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న చింతా నాగరాజు

గోరంట్ల, మార్చి 10: వెనుకబడిన కులాలకు చట్టపరంగా ప్రాధాన్యమిస్తూ, జనాభా ప్రాతిపదిక రిజర్వేషన్ కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతా నాగరాజు కోరారు. గోరంట్లలోని మాధవరాయ ఆలయంలో ఆదివారం జరిగిన బీసీ ఉద్యోగుల సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... రాష్ట్ర జనాభాలో 139 బీసీ కులాలవారు 65 శాతం మంది ఉన్నారన్నారు. చట్టసభలైన అసెంబ్లీ, పార్లమెంటు, పంచా యతీలకు వారు తమ వాటాగా వెళ్లేలా రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉద్యోగాల్లోనే కాకుండా ప్రయివేటు రంగాల్లోనూ రిజర్వేషన్ కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, నాయకులు దేవీ ప్రకాష్, చిగిచెర్ల గురుమూర్తి, చిగిచెర్ల వెంకటేష్, ఆయిల్ చంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రావుడి జట్టు



విజేతగా నిలిచిన రావుడి పంచాయతీ జట్టు

అగళి, మార్చి 10 : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా రావుడి పాఠశాల జట్టు నిలిచింది. రన్నర్‌గా హెచ్‌డీ హళ్లి, మూడో స్థానంలో అగళి జట్టు నిలిచినట్లు గ్రీన్‌భారత్ తాలూకా అధ్యక్షుడు కామరాజు తెలిపారు. మొదటి బహుమతి కింద రావుడి జట్టు రూ.30వేలు, రెండో బహుమతి హెచ్‌డీహళ్లి రూ.15వేలు, మూడో బహుమతి అగళికి రూ.10వేలను అందజేశారు. ఆయా జట్లకు వక్కలిగ తాలూకా అధ్యక్షుడు అనంతరాజు, టీడీపీ మాజీ సర్పంచ్ రవికుమార్, టీడీపీ ఎంపీటీసీ నాగోజీ, సర్పంచ్ హనుమంతరాయప్ప, టీడీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ చేతులమీదుగా నగదుతోపాటు షీల్డ్ బహుమతులు అందజేశారు.